క్లుప్తంగా

కురుపాం ఎస్సైగా షణ్ముఖరావు



గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం ఎస్సైగా ఎస్.షణ్ముఖరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన సీహెచ్ ప్రసాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎల్విన్‌పేట ఎస్సైగా విధులు నిర్వహించిన షణ్ముఖరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది, ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఇష్టపడి చదవాలి: ఆర్డీఓ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

కొమరాడ: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఆర్డీఓ కె.హేమలత అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని శనివారం ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ప్రణాళికతో సాధన చేస్తే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవచ్చన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ అరుణకుమారి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

గురుస్వాములకు సన్మానం



గురుస్వాములను సన్మానిస్తున్న అయ్యప్ప భక్తులు

పాలకొండ: స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ సన్నిధానంలో అయ్యప్ప మండల దీక్ష పూర్తి చేసుకున్న భక్తులు శనివారం గురుస్వాములను సన్మానించారు. 41 రోజుల పాటు దీక్ష చేసి ఆదివారం శబరిమలై యాత్రకు బయలుదేరి వెళ్తున్న నేపథ్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మూర్తి గురుస్వామితో పాటు పలువురు సన్నిదాన గురుస్వాములను సత్కరించారు.

కొనసాగుతున్న యాగం



యాగశాలలో పూజలు చేస్తున్న దంపతులు

భామిని: మండలంలోని ఘనసరలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి యాగం శనివారం కొనసాగింది. 24 మంది దంపతులు యాగంలో పాల్గొని హోమాదికాలు నిర్వహించారు. బత్తిలి పురోహితులు రంపా లలితాప్రసాద్ శర్మ వేదమంత్రాల మధ్య నిర్వహించిన ఈ యాగంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దాం..



అడ్మిన్ సెక్రటరీలకు శిక్షణ ఇస్తున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

పాలకొండ రూరల్: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు సహకరించాలని డీఎల్‌డీఓ వీవీ గోపాలకృష్ణ అన్నారు. క్రీడల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక యాప్‌పై శనివారం సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల పరిధిలో నిర్వహించే ఐదు క్రీడా పోటీలకు సంబంధించిన స్కోర్ వివరాలను యాప్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలో వివరించారు. ఈ నెల 15 నుంచి నిర్వహించే ఈ క్రీడా పోటీలను సందడి వాతావరణంలో నిర్వహించాలన్నారు.

రబీ సాగుకు మడ్డువలస ప్రాజెక్ట్ నీరు ఇవ్వాలి

రేగిడి: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసే ఆరుతడి పంటలకు మడ్డువలస ప్రాజెక్ట్ నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు సూచించారు. ఉనుకూరు గ్రామంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు వరికోతలు పూర్తిచేసి, మొక్కజొన్న పంటను పొలాల్లో సాగు చేస్తున్నారని, అయితే మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తలేదన్నారు. ఈ క్రమంలో రైతులు మళ్లీ మొక్కజొన్న విత్తనాలు పొలాల్లో వేసేందుకు సన్నద్ధమవుతున్నారని, అవసరమైన సాగునీటిని మడ్డువలస కాలువల ద్వారా అందించాలన్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఇన్‌ఫ్లో ఉండగా, ఆ నీటిని వృథాగా నాగావళి నదిలోకి విడిచిపెట్టేస్తున్నారని, అలా కాకుండా ఆ నీటిని ప్రాజెక్ట్‌లో నిల్వ ఉంచి, రబీలో ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలన్నారు. దీనిపై అధికారులు ఆలోచించి, పత్రికా ప్రకటన ద్వారా సాగునీరు అందిస్తున్నట్లు ఓ ప్రకటన ఇవ్వాలని కోరారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



గరుగుబిల్లి: భక్తులకు స్వామివారి ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకస్వామి



సీతంపేట: వేంకటేశ్వర స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే ఆలయం వద్ద బారులు తీరారు. ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ, మంగళాశాసనం, తదితర పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ధర్మకర్త బి.ఇందుమతి ఆధ్వర్యంలో పలువురు భక్తులు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం ఆలయంలో గంట పద్మ, ఆమె కుమారులు మనీష్ నాయుడు, శ్రీధర్‌రాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ చర్యలు చేపట్టారు.

సీతంపేట: మండల కేంద్రంలో టీటీడీ నిర్వహణలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివానిరి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఉప్పు ద్రావణం పిచికారీతో మొలకల నివారణ



పొలంలో తడిసి ఉన్న చేనుపై ఉప్పుద్రావణం పిచికారీ చేయిస్తున్న ఏఓ

పాలకొండ రూరల్: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిచిన పంటను రక్షించుకునేందుకు రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు పాటించాలని ఏఓ ఎన్ని వాహిని అన్నారు. వ్యవసాయ సహాయకులతో కలిసి శనివారం మండలంలోని లుంబూరు, బుక్కూరు, మంగళాపురం తదితర గ్రామాల్లో పర్యటించారు. వర్షాలకు తడిసిన వరి పనలను పరిశీలించారు. ధాన్యం మొలకెత్తకుండా లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి చేలుపై పిచికారి చేయాలని రైతులకు సూచించారు. పూర్తిగా ఆరని పనలను కుప్పగా వేయాలనుకుంటే 25 కిలోల ఉప్పును ఎకరా పంటకు సరిపడేలా పనలపై చల్లుకుంటూ గాలి తగిలే విధంగా కుప్పలు వేయాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న చేను పడిపోతే పొలంలో నీరు నిల్వ లేకుండా పూర్తిగా తొలగించి చేను నిలబెట్టి కట్టాలన్నారు. నూర్పిడి పూర్తిచేసిన ధాన్యం తడిస్తే గింజ మొలకెత్తకుండా క్వింటాకు కిలో ఉప్పు, 20 కిలోల ఊక పొడిని కలిపి కుప్పలు పెట్టాలని, తద్వారా నష్ట శాతం తగ్గించవచ్చని రైతులకు సూచించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భామిని: మండలంలోని నల్లరాయిగూడలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఉజ్వల గ్యాస్ పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం అర్హులైన వారి పేర్లు నమోదు చేశారు. కార్యదర్శి శంకరరావు, సర్పంచ్ గొయింతి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి



రైతు సమస్యపై మాట్లాడుతున్న అప్పలనాయుడు, తదితరులు

పాలకొండ రూరల్: తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, వర్షాలకు తడిచి రంగుమారిన ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు కోరారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ.. విపత్తుల కారణంగా రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు విషయంలో అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాలన్నారు. అధికారులు పంటనష్టాలను పరిశీలించి రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. రైతు సమస్యలపై ఈ నెల 28న ఉమ్మడి జిల్లాల పరిధిలో కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు రైతు సంఘాల నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, వి.రమణమూర్తి, బోను అంజయ్య, ఎందవ సూరిబాబు తదితరులున్నారు.

జీడిమామిడి సాగులో సస్యరక్షణ



తెగులుసోకిన జీడి చెట్టు

గరుగుబిల్లి: జీడిమామిడి తోటలను ఆశించే అగ్గి తెగులు, టీ దోమ కారణంగా పంట దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జీడిమామిడిలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను కేవీకే శాస్త్రవేత్త హరీష్‌రావు సూచించారు. తోటకు టీదోమ ఆశించినప్పుడు చిగుర్లు, పూత ఎండిపోయి కనిపిస్తుంది. టీదోమ నివారణకు క్లోరిఫైరిఫాస్ 16 ఎంఎల్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి చిగుర్లు, కాండం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. తరువాత పూత సమయంలో క్వినాల్‌ఫాస్ మందును, పిందె సమయంలో కార్బరిల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. ఈ మూడు దశలో మూడు రకాల మందులను వినియోగించడం వల్ల టీదోమతో పాటు ఇతర తెగుళ్లను అరికట్టి దిగుబడి పెంచుకోవచ్చన్నారు. అలాగే వేపనూనె 50 ఎంఎల్ 10 లీటర్ల నీటిలో, పది గ్రాముల సబ్బు పొడిని కలిపి పిచికారీ చేసినా ఫలితం ఉంటుందన్నారు. కాగా ఐదేళ్లు దాటిన ప్రతీ చెట్టుకు 500 గ్రాముల యూరియా, 400 గ్రాముల సూపర్‌ఫాస్ఫేట్, 100 గ్రాముల పొటాష్ వేయడం వల్ల దిగుబడి మరింత పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ఓటు వజ్రాయుధం



ఓటు హక్కు ఆవశ్యకతను విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

పాలకొండ రూరల్: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పైల శంకరరావు అన్నారు. కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటుహక్కు ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రధాన్యత, నమోదు, వినియోగం, తదితర అంశాలపై అధ్యాపకులు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అధ్యాపకులు తేజేశ్వరరావు, గోవిందరావు, నారాయణరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందుకు ఎన్ఎస్ఎస్ పీఓ వెలమల అప్పారావు నేతృత్వంలో విద్యార్థులు ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు.

విద్యుత్ శాఖ ఈఈపై చర్యలకు జర్నలిస్టుల డిమాండ్

పార్వతీపురం టౌన్:

విద్యుత్ శాఖలో బదిలీలపై వివరణ కోరిన జర్నలిస్టులపై దురుసుగా వ్యవహరించిన పార్వతీపురం విద్యుత్ శాఖ ఈఈ వీవీ కిశోర్‌పై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే అలజంగి జోగారావులకు ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద శాఖాపరమైన బదిలీల్లో తమకు అన్యాయం చేశారని యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది ఆందోళన చేపట్టడంతో వార్తను సేకరించేందుకు జర్నలిస్టులు సంబంధిత అధికారి అయిన ఈఈ వీవీ కిశోర్‌ను వివరణ కోరామన్నారు. ఈ క్రమంలో ఈఈ పత్రికా విలేకరులపైన దురుసుగా ప్రవర్తించి బయటకు పోవాలని నెట్టివేసి అనుచిత వ్యాఖ్యలు చేయడం, జర్నలిస్టుల పట్ల ప్రవర్తించిన తీరు సరికాదన్నారు. ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలో ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో సర్పంచుల పర్యవేక్షణలో పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ తెలిపారు. గుమ్మడివరం, లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. వర్షాల కారణంగా గ్రామాల్లో కాలువల్లో మురుగు నిల్వ ఉండి దోమలు పెరిగాయని వీటి నివారణకు కాలువల్లో పూడికలు తీయిస్తున్నామన్నారు. మంచినీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాకు వారం రోజుల్లో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శరవేగంగా రామమందిరం నిర్మాణ పనులు

- దేవదాయ శాఖ డీఈఈ కృష్ణ



రామమందిరం పనులను పరిశీలిస్తున్న డీఈఈ కృష్ణ

సీతానగరం: ప్రభుత్వ ఆర్థిక సహాయంతో కాశీపేటలో శరవేగంగా రామమందిరం పనులు జరుగుతున్నాయని, నెల రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ డీఈఈ కెవిసి.కృష్ణ తెలిపారు. సీతానగరం మండలం కాశీపేటలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న రామమందిరం పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీపేట రామమందిరం పురాతన కట్టడం కావడంతో శిథిలావస్థకు చేరిందన్నారు. నూతనంగా రామమందిరం భవనం నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కోరిన మేరకు పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి ఫలితంగా ప్రభుత్వం రామ మందిరం నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేసిందన్నారు. దీనికి తోడుగా పబ్లిక్ కాంట్రిబ్యూషన్‌గా రూ.8 లక్షలు చెల్లించడం వలన కాంట్రాక్టరుకు నిర్మాణ బాధ్యతలు అప్పగించడంతో రెండస్తుల మందిర నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే రెండస్తుల మందిర భవనం పూర్తి కాగా శిల్పాల పనులు, ఇటుకలతో కట్టడం పనులు జరుగుతున్నాయని తెలిపారు. మందిర నిర్మాణానికి నిధుల కొరత లేదని, నిర్దేశించిన గడువులోగా నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.ధనంజయమ్మ, కమిటీ సభ్యులు టి.శ్రీనివాసరావు, ప్రభాకరరావు, ధనంజయరావు, వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవ ప్రాజెక్టుతో రైతులకు మేలు



రైతులకు సూచనలిస్తున్న సర్పంచ్ అమల

గుమ్మలక్ష్మీపురం: పంటల సాగు ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందేలా రైతులకు ప్రోత్సాహం అందిస్తున్న జీవ పైలెట్ ప్రాజెక్ట్‌ను సద్వినియోగించుకోవాలని రాయగడ జమ్ము సర్పంచ్ పి.అమల అన్నారు. మండలంలోని గొరడ గ్రామంలో వల్లాడ, పెంగవ, రాయగడజమ్ము, గొరడ గ్రామాలకు చెందిన రైతులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గడం, వర్షాభావ పరిస్థితులు, చీడపీడల సమస్య, వ్యవసాయంపై ఆసక్తి లేకపోవడం వంటి పరిణామాల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రకృతి వ్యవసాయమే ఉత్తమ మార్గమని అన్నారు. జట్టు సంస్థ పర్యవేక్షణలో నాబార్డ్ ఆర్థిక సాకారంతో అమలు చేస్తున్న జీవ పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు మంచి ప్రయోజనకరమని, రైతులంతా ఈ ప్రాజెక్ట్ ద్వారా వివిధ పంటలు సాగుచేసి ఆర్థికంగా వృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ అధ్యక్షుడు టి.జమ్మయ్య, కార్యదర్శి కె.చిరంజీవి, కోఆర్డినేటర్ జి.ప్రభోద్, ఆదితల్లి సీఈఓ పి.మురళి, జట్టు కోఆర్డినేటర్ జి.మురళీమోహన్, సీఆర్పీ యశోదదేవి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



కె.రామభద్రపురం పీహెచ్‌సీలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న మల్లేశ్వరరావు, తదితరులు

కొమరాడ: అన్ని దానాల కంటె అన్నదానం చేస్తే మానసిక తృప్తిని ఇస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రెజరర్ కళింగి మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని కొమరాడ, కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శనివారం వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు, రోగులకు పౌష్టికాహారంతో పాటు పండ్లు, పాలు అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. గిరిశిఖర గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, రోగులకు రుచికరమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత పేదలకు పంచడం ద్వారా మానసిక సంతృప్తిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో విక్రంపురం సర్పంచ్ కళింగి శైలజ, సత్యసాయి సేవాసమితి సభ్యులు, వైద్యులు అరుణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



పాలకొండ: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయ్ కుమార్



కురుపాం: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న మేజిస్ట్రేట్ ఎం.రోహిణిరావు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కేసుల నుంచి త్వరితగతిన బయటపడేందుకు రాజీయే రాజమార్గమని, అందుకు జాతీయ లోక్ అదాలత్ చక్కని వేదిక అని న్యాయమూర్తి ఎం.రోహిణీరావు అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 179 కేసులను పరిష్కరించినట్లు న్యాయమూర్తి తెలిపారు. ఇందులో ఎస్‌టీసీ కేసులు 157, ఐపీసీ 336(అడ్మిషన్స్) కేసులు 20, లేబర్ కేసులు 2 ఉన్నట్లు చెప్పారు. కక్షిదారుల నుంచి రూ.40,600లు అపరాధ రుసుం వసూలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు బి.చంద్రమౌళీశ్వరరావు, ఐ.వాసుదేవరావు, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పాలకొండలో..

పాలకొండ: స్థానిక కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 663 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయ్‌కుమార్‌రాజ్ తెలిపారు. కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ మంచి అవకాశమని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు, న్యాయవాదులు శివదాస్, వెంకటేశ్వరరావు, కె.రవి, ఎం.గోవిందరావు, ఎం.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం : డీఐఓ



గర్భిణుల వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

సీతానగరం: వైద్య ఆరోగ్య శాఖాధికారి, సిబ్బంది హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని డీఐఓ టి.జగన్‌మోహనరావు సూచించారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల ఆరోగ్య తనిఖీల కోసం నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమాన్ని, ఆస్పత్రిలో గర్భిణులకు నిర్వహించిన వైద్య పరీక్షలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది మాతా, శిశు సంరక్షణ కార్డులో నమోదు చేసిన ఆరోగ్య వివరాలు పరిశీలించి వైద్య పరీక్షల నివేదికలు అసాధారణంగా ఉన్న గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించి తగిన సేవలు అందించాలని సూచించారు. టీడీ వ్యాక్సిన్ రెండో డోసులు నెల వ్యవధిలో గర్భిణులందరికీ వేయాలన్నారు. కాన్పు సమయం దగ్గరగా ఉన్న గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం అక్కడ గర్భిణులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారిణి ఉషారాణి, సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, సూపర్‌వైజర్ భవాని, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గౌడ సామాజిక వర్గానికి అండగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: గౌడ సామాజిక వర్గానికి అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో గల పింఛన్ల భవనంలో శ్రీ గోపాల కృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గం ఎదురుచూసిన శ్రీకృష్ణ జ్ఞాన మందిరం నిర్మాణం చేపట్టడం గొప్ప విషయమని, నిర్మాణం చేస్తున్న భూమికి సంబంధించి పొజిషన్ పట్టాను అందరి సమక్షంలో అందజేశారు. అందరి మేలును ప్రభుత్వం కోరుకుంటుందన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల శ్రీదేవి, బత్తుల నాగేష్, బత్తుల శ్రీనివాసరావు, కౌన్సిలర్ సభ్యులు యడ్ల త్రినాథ, సర్పంచ్ జక్కు ప్రవీణ్, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడి పూజ

మక్కువ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో వేద పండితుడు ఆరవెల్లి విజయ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పడిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి కాళహస్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విఘ్నేశ్వర స్వామికి, సుబ్రహ్మణ్య స్వామికి 108 కలువలు, అయ్యప్ప స్వామికి 1008 కలువ పువ్వులతో పూజలు చేపట్టారు.